ప్రజాశక్తి

బుధవారం 4 అక్టోబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సంతమాగులూరు మండలంలోని అద్దరోడ్డు జంక్షన్ నుండి కామేపల్లి వరకు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

పోరాటమే 'దేశం' ఎజెండా.!

- చంద్రబాబు అరెస్టుపై వైసిపిలో తర్జనభర్జనలు
- మంత్రి సురేష్ తప్ప ఎవరూ పెద్దగా స్పందించని వైనం
- అరెస్టుతో లాభనష్టాలపై పాలకపక్ష నేతల్లో మిశ్రమ చర్చలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా పోరాటం చేయడమే ప్రస్తుత ఎజెండాగా తెలుగుదేశం ఎంచుకుంది. దీన్ని ఎంతమేరకు జనంలోకి తీసుకుపోతే అంత మేలనే ఆలోచనలో ఆ పార్టీ నేతలున్నారు. న్యాయపోరాటం చేస్తూనే.. అరెస్టులు అన్యాయమనే భావన జనంలోకి తీసుకుపోవాలనే యోచనలో గట్టిగా ఉన్నారు. చంద్రబాబు అరెస్టు జరిగి.. పాతిక రోజులు దాటింది. అరెస్టు రోజు నుంచీ తెలుగుదేశం నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. మొదట్లో కొంత ప్రతిఘటన పోరాటాలు చేపట్టినా రానురానూ వాటి దిశను మార్చారు. పోలీసులు కేసులు పెట్టడంతో పోరాట పంథాను కూడా మార్చుకున్నారు. శాంతియుతంగానే వివిధ రూపాల్లో వినూత్న నిరసనలు చేపడతున్నారు. ఇదే ఇప్పుడు ఆ పార్టీకి పెద్ద ఎజెండాగా మారింది. చంద్రబాబు అరెస్టు వ్యవహారం అంతా కేంద్రం నుంచే నడుస్తోందన్న చర్చ కూడా ముందుకు ▶ 2లో

రైతాంగాన్ని మోసగించిన మోడీ

- పలువురు రైతు, కార్మిక సంఘాల నేతల ధ్వజం
- లిఖితపూర్వక హామీల అమలుకు నిరాకరణ
- లఖింపూర్ ఖేరీ అమరులైన రైతులకు నివాళి
- ఒంగోలులో బ్లాక్‌డే విజయవంతం



అమరులైన రైతులకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాలు, రైతుసంఘాల నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలోని రైతులను ప్రధాని నరేంద్ర మోడీ మోసం చేశారని పలువురు రైతు, కార్మిక సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ ఘటన జరిగి ఏడాది అయిన సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద ఘటనలో అమరులైన రైతు నేతలు, జర్నలిస్టు చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించి.. బ్లాక్‌డేగా పాటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుంచు శేషయ్య, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు కాలం సుబ్బారావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను ఒకటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రధానంగా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ హామీలను ఒక్కటీ అమలు చేయలేదని, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించలేదన్నారు. ఫసల్ బీమా యోజన పథకాన్ని దేశవ్యాప్తంగా రైతాంగానికి అమలు చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉన్న అప్పులు రుణమాఫీ చేయాలన్నారు. లేకపోతే రానున్న ఎన్నికలలో బిజెపి ఓటమి లక్ష్యంగా పనిచేస్తామని హెచ్చరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాల వద్ద నవంబర్ 26, 27, 28వ తేదీలలో నిర్వహించే నిరసన కార్యక్రమాలలో రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ దేశంలోని ప్రజల సంపదను ప్రధాని మోడీ కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. చారిత్రాత్మక రైతాంగ పోరాటంలో వందల సంఖ్యలో రైతులు ప్రాణాలు అర్పిస్తే.. లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయటంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించటంతో పాటు రైతాంగం అప్పులను మాఫీ చేయాలని కోరారు. లిఖిత పూర్వక హామీలు అమలు చేసే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా రోజుకి రూ. 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని పట్టణ పేదలకు కూడా వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ లఖింపూర్‌ఖేరీ ఘటన జరిగి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇప్పటికీ నిందితులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాపాడుతుందని ఆగ్రహం ▶ 3లో

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

- త్వరగా పూర్తి చేయించాలని అధికారులపై ప్రభుత్వం ఒత్తిళ్లు.!
- గృహ నిర్మాణం విషయంలో లబ్ధిదారుల నిరుత్సాహం..
- డబ్బులు సరిపోక ఇబ్బందులు
- జగనన్న కాలనీల్లో ఇదీ పరిస్థితి



జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిర్మించిన ఇళ్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లోని 'పేదలందరికీ ఇళ్లు' పథకం నత్తనడకన సాగుతోంది. సుమారు నాలుగేళ్ల నుంచి సాగుతున్న ఆ పథకాన్ని ఇప్పుడు వేగవంతం చేశారు. ప్రభుత్వం కాలపరిమితి ముగుస్తుండటంతో జగనన్న కాలనీలను ప్రారంభించడం ద్వారా తమ ప్రభుత్వం ఎలా పనిచేసిందనే విషయాన్ని ప్రజలకు చూపాలని చూస్తున్నారు. అందులో భాగంగానే పెద్దఎత్తున జగనన్న కాలనీలు ప్రారంభించాలని అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది. అయితే లబ్ధిదారులు మాత్రం తమ వద్ద డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. యర్రగొండ పాలెం మండలంలో తొమ్మిది కాలనీల్లో 703 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో కేవలం 12 శాతం మాత్రమే పూర్తి చేశారు. ఇళ్లు పూర్తి చేస్తారా? లేదా.? అంటూ స్థానిక అధికారులు లబ్ధిదారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు కట్టించడానికి పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలం కేటాయించింది. నిరుపేదలకు ఇంటి స్థలం ఇవ్వడం మంచిదే అయినప్పటికీ గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే కేటాయించింది. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఈ మొత్తం కనీసం లెంటల్ లెవల్ వరకు మాత్రమే నిర్మాణం జరిగే అవకాశాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల జీవన విధానంలో అనేక మార్పులొచ్చాయి. కూలీ పనులు లేకపోవడం, అప్పులు దొరక్కపోవడం ఒక ఎత్తయితే ఇటుక, సిమెంట్, ఇనుముతో పాటు కూలీల ధరలు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో గృహనిర్మాణం ఆలస్యంగా సాగుతోంది. నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో బ్యాంకుల నుంచి రూ.30 వేలు రుణం ఇప్పించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పన అంతంతమాత్రంగా ఉంది. తాగునీరు, విద్యుత్, కీలకంగా ఉండటంతో వాటిపై అధికారులు దృష్టి పెట్టారు. అధికారులు, ప్రభుత్వ ఆదేశంతో హడావుడిగా పనులు ప్రారంభించినా నిర్మాణానికి అవసరమైన నీటి వసతుల్లేక పలుచోట్ల ఆలస్యంగా సాగుతున్నాయి. మండలంలోని మిల్లంపల్లి, వాదంపల్లి, నరసాయిపాలెం, గడ్డమీదపల్లి, యల్లారెడ్డిపల్లి, గోళ్ళవిడిపి, గంగపాలెం, బోయలపల్లి, గురిజేపల్లి పలు ప్రాంతాల్లో పనులు నిలిచిపోయాయి.

రాయితీ అంతా కేంద్రానిదే..

ఒక్కో ఇంటికి కేవలం రూ.1.80 లక్షలు రాయితీ ఇస్తున్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పైసా రాయితీ ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు, రూ.50 వేలు చొప్పున నిధులిచ్చారు. ఇప్పుడు ▶ 3లో



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈవీఎంలకు పటిష్ట భద్రత

అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల కోసం జిల్లాకు వచ్చిన ఈవీఎం యంత్రాలకు అధికారులు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. బాపట్ల జిల్లాకు భారీగా ఎన్నికలకు సంబంధించిన యంత్రాలు రావడంపై కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎం గోదామును కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గోదాములో ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. గోదాము వెలుపల పోలీసుల రక్షణ వ్యవస్థను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. వర్షం పడితే గోదాములోకి వర్షం నీరు, చెమ్మ కూడా లోపలికి రావడానికి వీల్లేదని ఆయన ఆదేశించారు. వర్షాల సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుల రక్షణ, వారి పనితీరుకు సంబంధించిన దస్త్రాలు, సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. బాపట్ల జిల్లా నూతనంగా ఏర్పడినప్పటికీ ఆరు నియోజకవర్గాలకు అవసరమైన యంత్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. బ్యాలెట్ యూనిట్లు 4,620 యంత్రాలు రాగా 4,620 వి.వి.ప్యాట్స్ యంత్రాలు, 4,200 కంట్రోల్ యూనిట్లు వచ్చాయన్నారు. యంత్రాలతో పాటు జిల్లాకు వచ్చిన బిఈఎల్ (భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్) ఇంజినీర్లు ఎనిమిది మందితో ఆయన మాట్లాడారు. వచ్చిన యంత్రాలకు ▶ 6లో

పోరాటమే 'దేశం' ఎజెండా.!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చింది. ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వ కుట్రగా విమర్శల దాడిని పెంచిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అంతా కేంద్రం నుంచే నడుస్తోందన్న భావనతో బయటపడే ప్రయత్నాలు కూడా ఢిల్లీ వేదికగా సాగుతున్నాయనే చర్చ సాగుతోంది. లోకేష్‌కూ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో పార్టీ వర్గాల్లో ఇక పోరాటం తప్పదనే భావన కూడా పెరిగింది. చంద్రబాబు బయటకు రావడానికి ఇంకా సమయం పడుతుందనే సంకేతాలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ యావత్తూ ఇప్పుడు ప్రధానంగా నిరసన ఉద్యమాలపైనే దృష్టి సారించింది. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు ఇప్పుడు ఇదే పనిలో ఉన్నారు. నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాలు కదులుతున్నారు. ఎక్కువ పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాల ప్రజానీకం కూడా కదిలేలా చేస్తున్నారు. అరెస్టు వ్యవహారాన్ని తమకు వీలైనంత మేరకు అనుకూలంగా మార్చుకునే వ్యూహంలో తెలుగుదేశం నేతలున్నారు. చంద్రబాబు అరెస్టుతో మొదట్లో గందరగోళంలో ఉన్న నేతలు ఇప్పుడు తేరుకున్నారు. పోరాటమే మార్గమని భావించారు. అక్కడ న్యాయస్థానాలతోనూ, రాజకీయంగానూ అన్ని వైపులా ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక్కడ మాత్రం రాజకీయ పోరాటాలను ఉధృతం చేస్తున్నారు. జనంలో ఇదొక అక్రమ వ్యవహారంగా మరింత వేగంగా తీసుకుపోయే యత్నం చేస్తున్నారు. తెలుగుదేశం నిరసన పోరాటాలు తీవ్రతరమవుతున్నాయి. ఇక వైసిపిలోనూ చంద్రబాబు అరెస్టుపై తర్జనభర్జన సాగుతోంది. అరెస్టుపై మొదట్లో కొంత వాడివేడిగా ఆలోచించారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడంటూ ఒకరిద్దరు ముఖ్యనేతలు మాట్లాడారు. తర్వాత వదిలేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్ తప్ప మిగతా నేతలు పెద్దగా స్పందించలేదు. పై నుంచి మాట్లాడాలని ఆదేశాలు వస్తున్నాయి. తెలుగుదేశం చేస్తున్న పోరాటాలకు కౌంటర్‌గా మాట్లాడాలని కొందరు కీలకనేతలను ఎంపిక చేసుకొని ప్రెస్‌మీట్లు పెట్టించారు. ఇప్పుడు అవి కూడా తగ్గాయి. అరెస్టు వల్ల లాభం ఎంత? నష్టం ఎంత? అనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. సీనియర్‌లుగా ఉన్న వైసిపి నేతల్లో మాత్రం అరెస్టుపై కొంత అసంతృప్తిగానే ఉందని సమాచారం. ఇలాంటి ప్రతికార అరెస్టుల వల్ల రాజకీయంగా నష్టం జరుగుతుందనే ఆలోచన చేస్తున్నారు. అందుకే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు కూడా ఈ వ్యవహారాన్ని దాటవేస్తున్నారు. ప్రజల్లో ఇలాంటి వాటిపై వ్యతిరేకత వస్తుందనే ఆలోచన కూడా ఉంది. అందుకే రానురానూ ఈ వ్యవహారంలో బిజెపి పాత్ర కీలకమనే చర్చను ముందుకు తెచ్చారు. ఇప్పుడు అందరిలోనూ చంద్రబాబు అరెస్టుకు బిజెపి కీలకపాత్ర వహించిందనే చర్చ నడుస్తోంది. తెలుగుదేశం వర్గాల్లోనూ ఇదే ఉంది. ఇక్కడ రాజకీయంగా మైలేజీ కోసం సిఎం జగన్‌పై, వైసిపి నేతలపై విమర్శలు చేసినా అసలు కథ అంతా ఢిల్లీ నుంచే నడిచిందని భావిస్తున్నారు. ఎక్కువ రోజులు చంద్రబాబు లోపలే ఉంటే వైసిపికి నష్టం కూడా పెరుగుతుందనే చర్చ కూడా రాజకీయవర్గాల్లో నడుస్తోంది. అరెస్టు వ్యవహారం ఇప్పుడు క్లిష్టతరమైన అంశంగా మారింది. మరోవైపు దీనిపై నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నాయి. సర్వేల సంస్థలు కూడా ప్రస్తుత పరిస్థితి ఏమిటనేదానిపై దృష్టి సారించాయి. వైసిపికి ఈ వ్యవహారం ఎంత మేరకు నష్టం కలిగిస్తుంది? చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి జనంలో పెరిగే సానుభూతి ఎంత? అనే దానిపై పలు సంస్థలు అంచనాల్లో ఉన్నాయి.

రైతాంగాన్ని మోసగించిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ర్యాలీ జరుపుతున్న రైతులపై కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రా కారుతో గుద్దించి రైతుల ప్రాణాలు తీశారన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఘటనకు కారణమైన ఆశిష్ మిశ్రాను అరెస్టు చేసేందుకు సుప్రీంకోర్టు కలుగచేసుకోవాల్సి వచ్చిందన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకపోవడం దుర్మార్గమన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుంచు శేషయ్య మాట్లాడుతూ దేశంలోని సంపదను బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టటమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు అందులో భాగమేనని అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ ఏటా లక్షల కోట్ల రూపాయలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగ ఆదాయానికి గండి కొడుతోందన్నారు. 2022 విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. లలిత కుమారి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా ను ప్రభుత్వం బర్తరఫ్ చేయటంతో పాటుగా ఆయన కుమారుడు ఆశిష్ మిశ్రాను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు జామాయిల్ సుబాబుల్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమా రెడ్డి, సిఐటియు నాయకులు జివి కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి బాలకోటయ్య, ఏఐకెఎస్ నాయకులు కోడూరి నాంచార్లు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పివిఆర్ చౌదరి, మద్దిపాడు ఏఎంసి మాజీ చైర్మన్ ఎం. రంగారావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఆర్ మోహన్, ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌డి సర్దార్ ప్రసంగించారు. కార్యక్రమం ఏఐకెకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతు నాయకులు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షల రాయితీనే కల్పిస్తున్నారు. అధికారుల ఒత్తిడితో పేదలు పునాదులు వేసినా, వీటికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవడంలేదు. దీంతో చాలా మంది పునాదులు వేసి వదిలేశారు. కొంత మంది అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసినా మధ్యలో ఆపేశారు. ఒక్కో ఇంటికి తక్కువగా వేసుకుంటేనే రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

మండలంలో పక్కా గృహాల నిర్మాణాలిలా..

- మిల్లంపల్లి జగనన్న కాలనీలో మంజూరైన గృహాలు 561, పూర్తయినవి 74, శ్లాబ్ వేసినవి 3, శ్లాబ్ లెవల్ 15, బేస్ మట్టాలు 232, పునాదులు 236, ప్రారంభించనివి 1.
- వాదంపల్లిలో మంజూరైనవి 31, శ్లాబ్ వేసినవి 10, శ్లాబ్ లెవల్ 3, బేస్ మట్టాలు 3, పునాదులు 15.
- నరసాయిపాలెంలో మంజూరు 23.. పూర్తయినవి 7, శ్లాబ్ వేసినవి 3, శ్లాబ్ లెవల్ 3, బేస్ మట్టాలు 6, పునాదులు 4.
- గడ్డమీదపల్లిలో మంజూరు 12, పూర్తయినవి 1, శ్లాబ్ వేసినవి 1, శ్లాబ్ లెవల్ 6, బేస్ మట్టం1, పునాదులు 3..
- యల్లారెడ్డిపల్లిలో మంజూరు 1, పునాదులు 1..
- గోళ్ళవిడిపిలో మంజూరు 12, బేస్‌మట్టాలు 8, పునాదులు 4.
- గంగపాలెంలో మంజూరు 6, పునాదులు 6.
- బోయలపల్లిలో మంజూరు 45, పూర్తయినవి 2, శ్లాబ్ వేసింది 1, శ్లాబ్ లెవల్ 4, బేస్ మట్టాలు19, పునాదులు 19..
- గురిజేపల్లిలో మంజూరు 12.. పూర్తయినవి 2, శ్లాబ్ వేసింది 1, శ్లాబ్ లెవల్ 1,బేస్ మట్టాలు 6, పునాదులు 2.

సమయం లేదు.. పూర్తి చేయండి..

రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికలను దష్టిలో పెట్టుకొని జగనన్న కాలనీలు పూర్తి చేయాలని చూస్తోంది. మరికొద్ది మాసాల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుండటంతో అంతకుముందే అన్ని ఇళ్లనూ పూర్తిచేయాలని చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులపై తీవ్రమైన ఒత్తిడి చేశారు. నిత్యం వీడియోకాన్ఫరెన్స్‌తో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఓ వైపు ప్రభుత్వం ఆదేశాలు, మరో వైపు లబ్ధిదారుల వద్ద నగదు లేకపోవడంతో అధికారులు నలిగిపోతున్నారు. ప్రస్తుతం కేవలం 12 శాతం మాత్రమే ఇళ్లు పూర్తి చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. మరో రెండు, మూడు నెలలు మాత్రమే సమయం ఉండటంతో ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



కట్టా రాజశేఖర్

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చిమ్మరిబండ గ్రామంలో చోటు చేసుకుంది. మార్టూరు పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం చిమ్మిరిబండ గ్రామంలోని బొడ్డురాయి సెంటర్‌లో నివాసం ఉండే కట్టా శ్రీనివాసరావు చిన్న కుమారుడు రాజశేఖర్(22) ఇటీవల బిటెక్ పూర్తి చేసి సివిల్స్ కోచింగ్ తీసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ క్రమంలో తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పరీక్షించగా అప్పటికే మతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న మార్టూరు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోడూరి కమలాకర్ తెలిపారు.

చిమ్మిరిబండలో విషాదఛాయలు

గ్రామంలో సౌమ్యుడుగా పేరున్న కట్టా రాజశేఖర్ హై స్కూల్ స్థాయి నుంచి చదువులో మంచి ప్రతిభ కనబరుస్తూ ఇటీవలే సివిల్ ఇంజినీరింగ్ మంచి మార్కులతో పూర్తి చేశాడు. సివిల్స్ కోచింగ్ తీసుకొని కలెక్టర్ అవ్వాలనేదే తన లక్ష్యమని స్నేహితులతో చెబుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో స్నేహితులతో పాటు గ్రామస్తులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తర్లుపాడు

కర్రల లోడుతో వెళ్తున్న టాక్టరును మోటారు సైకిల్ మీద వెళుతున్న వ్యక్తి ఢీకొని మృతి చెందిన సంఘటన మండలంలోని నాగేళ్లముడుపు వద్ద జరిగింది. కొనకల మెట్ల మండలం ఎదురు రాళ్లపాడుకు చెందిన కుర్ర వెంకటేశ్వర్లు(30) తర్లపాడు మండలంలోని నాగేళ్ళ ముడుపు లోని అత్తవారింటికి వెళ్తుండగా నాగల ముడుపు సమీపంలోనికి రాగానే ఫతేపురం గ్రామం నుంచి కర్రలలోడుతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తర్లుపాడు మండల ఎస్ఐ ఎ.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

400 లీటర్ల నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి-కొమరోలు



ధ్వంసం చేస్తున్న నాటుసారా

మండలంలోని ఎర్రగుంట్ల అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ స్థావరాలపై ఎస్‌బి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో గిద్దలూరు ఎస్ఈబి ఇన్స్పెక్టర్ అరుణ కుమారి జెడి టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన త్రిపురాంతకంలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం ప్రకారం..నంద్యాల జిల్లా కోవెలకుంట్ల గ్రామానికి చెందిన బోయ సుదర్శన్(46) అనే లారీ డ్రైవర్ గుంటూరు నుంచి పైపుల లోడుతో నంద్యాలకు బయలు దేరాడు. మార్గ మధ్యలో త్రిపురాంతకంలో గుండె నొప్పి రావడంతో లారీని పక్కకు ఆపి కిందకు దిగి సేద తీర్చుకునే ప్రయత్నం చేశాడు. అంతలోనే నొప్పి ఎక్కువై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన లారీ డ్రైవర్ సుదర్శన్

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE: CHIRALA
O.S .NO:410 /2022

Between:
The Diocese of Guntur Society Rep.by its Secretary & Treasurer .... Plaintiff
And
Kagita Kumar Raja and others ....Defendants

To.
D-1: Kagita Kumar Raja,S/o.Yesupadam, R/o.Vivekananda Colony, Near Lutheran Church, Kothapet ,Vetapalem (Post & Mandal), Bapatla Dist.

పై నెంబరు దావాలో 1వప్రతివాది అయిన మీకు సమన్లు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:18-10-2023కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణ లు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:18-10-2023

MALLELA KRISHNA KISHORE,
వాది తరపు న్యాయవాది,గుంటూరు,
సెల్: 98486 98595

మహారాజశ్రీ ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు లో ఒంగోలు
IA No :695/2023
AS No:100/2013

Between
మన్నం వెంకటేశ్వర్లు (డైడ్)మరియు ఇతరులు ..... పిటీషనర్స్
మరియు
మన్నం వెంకటేశ్వర్లు (డైడ్) మరియు ఇతరులు .....రెస్పాండెంట్స్

To
ఆర్3)మన్నం హరిబాబు
తండ్రి లేట్ వెంకటేశ్వర్లు, వయస్సు 49
సంవత్సరాలు హిందూ, వ్యవసాయం ఉప్పలపాడు
గ్రామం, కొండపి మండలం, ప్రకాశం జిల్లా

పై నెంబరు పిటిషన్ లో కోర్టు వారు నీకు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావు కావున కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం తేదీ:19.10.2023కు వాయిదా వేసి ఉన్నారు కావున ఆరోజు ఉదయం 10:30 కి పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా నీ ఏజెంట్ ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలుపు కొనవలెను లేనిచో కోర్టు వారు కేసును నీ పరోక్షమున తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
మేకల రామమూర్తి
పెళ్లూరి రామకృష్ణ
అడ్వకేట్స్,ఒంగోలు

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No.745/2021
F.D.I.A.No.1534/2017
O.S.No.12/1997

పెసల పెద సుబ్బమ్మ
మరియు వగైరాలు - పిటిషనర్లు
Vs
లెక్కల అంకమ్మ (డైడ్)
మరియు వగైరాలు - రెస్పాండెంట్లు
To,
R2. **పెద్దిరెడ్డి చిన్న సుబ్బమ్మ, భర్త చిన్న పిల్లయ్య**
R4. **నారపరెడ్డి మాల్యాద్రి,** తండ్రి **చిన్నప రెడ్డి**
R2 & R4 R/o చిన్నవరిమడుగు గ్రామం, మురుగమ్మి పోస్టు, పెదచెర్లోపల్లి మండలం, ప్రకాశం జిల్లా.
అయ్యా,

పై నెంబరు పిటిషన్‌లో పరిహారం కోరి మీ మీద పిటిషనర్స్, పిటిషన్‌ను దాఖలుచేసియుండుట వలన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నోటీసు పంపించి ననూ జారీ కానందువలన పై కోర్టు వారు మీకు నోటీసును ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని పై పిటిషన్‌ను **తే06-10-2023 దిన** వాయిదా వేయబడి ఉన్నది. కావున పై తేదీ యందు **ఉదయం గం॥ 10-30 నిమిషములకు** పైకోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని స్వయంగా గానీ,లాయర్ ద్వారా గానీ తెలుపుకొనవలసినదిగా మిమ్మల్ని ఆదేశించడ మైనది. పై తేదీ నందు మీరు హాజరుకానియెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా: 06-10-2023

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
పిటిషనర్స్ తరపు అడ్వకేట్స్, కందుకూరు.

మహారాజశ్రీ ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు లో ఒంగోలు
IA No :696/2023
AS No:100/2013

Between
మన్నం వెంకటేశ్వర్లు (డైడ్)మరియు ఇతరులు ..... పిటీషనర్స్
మరియు
మన్నం వెంకటేశ్వర్లు (డైడ్) మరియు ఇతరులు .....రెస్పాండెంట్స్

To
ఆర్3)మన్నం హరిబాబు
తండ్రి లేట్ వెంకటేశ్వర్లు, వయస్సు : 49
సంవత్సరాలు, హిందూ వ్యవసాయం, ఉప్పలపాడు
గ్రామం, కొండపి మండలం, ప్రకాశం జిల్లా

పై నెంబరు పిటిషన్ లో కోర్టు వారు నీకు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావు కావున కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం తేదీ:19.10.2023కు వాయిదా వేసి ఉన్నారు కావున ఆరోజు ఉదయం 10:30 కి పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా నీ ఏజెంట్ ద్వారా గాని హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను లేనిచో కోర్టు వారు కేసును నీ పరోక్షమున తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
మేకల రామమూర్తి
పెళ్లూరి రామకృష్ణ
అడ్వకేట్స్,ఒంగోలు

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం, గుడిపాటిపల్లి గ్రామ కాపురస్తురాలు చీతల వెంకట రమణయ్య గారి భార్య నరసమ్మ గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు, యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియ జేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కనిగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. 12561/2022 దారా కొనుగోలు చేసి సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించు చున్నారని, మరియు ఈ ఆస్తికి సంబంధిచిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన కనిగిరి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టరు కాబడిన దస్తావేజు నెం. 421 ఆఫ్ 2016ను పోగొట్టు కున్నారని, ఎంత వెతికిననూ ఈ రోజు వరకు దొరకలేదని చెప్పియున్నారు. ఈ విషయమై నా క్లయింటు కనిగిరి పోలీస్ స్టేషన్‌లో కంప్లయింటు ఇచ్చి ఉన్నారని, సదరు పోలీసువారు సదరు దస్తావేజు దొరకలేదని సర్టిఫికేట్ ఇచ్చియున్నారు. నా క్లయింటు లోను నిమిత్తం **LIC Housing Finance Ltd.,** ఒంగోలు వారిని సంప్రదించి యున్నారు.

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా సదరు ఆస్తిపై ఎవరికైనను లేదా ఏ వ్యక్తులకైనను ఏ విధమైన అభ్యంతరములు లేదా హక్కులు లేదా ఆసక్తి ఉన్నచో పైన పేర్కొనబడిన, పోయిన దస్తావేజు దొరికిన, దయచేసి ఈ క్రింది పేర్కొనబడిన సంతకం దారుని, వ్యక్తి గతంగా గానీ లేదా అడ్వకేట్ ద్వారా గాని అన్ని దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించిన 15 (పదిహేను) రోజులలోగా సంప్రదించగలరు. లేనచో నా క్లయింటు పైన పేర్కొన్న దస్తావేజు దొరకలేదని, ఎవరికీ ఏ విధమైన హక్కులు గానీ, అభ్యంతరములు గానీ లేవని భావించవలసి వస్తుంది. నిర్ణీత గడువు దాటిన తరువాత సదరు ఆస్తికి సంబంధించి వచ్చు ఏ విధమైన క్లెయిములు నా క్లయింటును గానీ, ఎల్.ఐ.సీ. హెచ్.ఎఫ్.ఎల్ వారిని గానీ బద్ధపరచజాలవు. **షెడ్యూలు :** ప్రకాశం జిల్లా, కనిగిరి మండలం, కనిగిరి నగర పంచాయితీ ఏరియాలోని సర్వే నెం. 426, 410, 411/2 దాఖలా య. 13.36 సెంట్లు గల భూమిలో ప్లాను దాఖలా సర్వే నెం. 426లోని ప్లాటు నెం. 39 నందు పడమరవైపు స్థలమునకు **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 39లోని మిగులు స్థలము మరియు ప్లాటు నెం. 40 స్థలము, **దక్షిణం :** సురసోని కాశీరెడ్డి మరియు ఇతరుల భూమి, **పడమర :** ప్లాటు నెం. 38 స్థలము, **ఉత్తరం :** 18.00 అ॥ దారి, **ఈ హద్దులలోని 128.365 చ॥గ॥ల స్థలము.**

ఇట్లు : **చల్లా వెంకటప్పారెడ్డి,** అడ్వకేట్,
డి.నెం. **24-1-19,** పాత గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురు, ఒంగోలు. సెల్ : **98480 44909**

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: BAPATLA
O.S. No. 141/2017

Between:
Komatla Rajeswari ...Plaintiff
Vs
Narisetti Veeranjaneyamma (DIED) and 2 others ...Defendants

To
D4.యడ్ల. అచ్యుత రావు, తండ్రి (లేటు) రాఘవయ్య, డోరు.నెం.11-8-10/A, ఏరియా ఆసుపత్రి రోడ్డు, బాపట్ల.

ఈ నెంబరు దావాలో వారి ప్రతివాదులపై Suit for redemption of mortgage deed, dated 10-05-2006 పరిహారం కోరుతూ దావా పెండింగులో ఉండగా 1వ ప్రతివాది మరణించినందున వారికి వారసులుగా ఈ నాల్గవ ప్రతివాదిని చేర్చినారు.ఈ దావాలో నాల్గవ ప్రతివాది అయిన యడ్ల అచ్యుత రావు, తండ్రి (లేటు) రాఘవయ్య, డోరు.నెం. 11-8-10/A, ఏరియా ఆసుపత్రి రోడ్డు, బాపట్ల, నోటీసు నిమిత్తం వాయిదా ది.01-11-2023 నకు వేసియున్నారు. మీరు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయముగా కానీ లేదా ప్లీడరు గారి ద్వారా కానీ కోర్టుకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యడల మిమ్ములను Ex-parte చేసి పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది : 01-11-2023

ఇట్లు
వాది తరపు అడ్వకేటు,
Ch. Sarat Chandu, Advocate
Bapatla, Cell No. 9704214181



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న రైతు ప్రతినిధులు

కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ లక్ష్యంపూర్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులను కారుతో తొక్కించి మరణానికి కారణమైన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి తనయుడుని అరెస్టు చేసి మంత్రిని బర్తరఫ్ చేయాలంటూ రైతు సంఘాల సమైక్య ఆధ్వర్యంలో తాహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు పరుస్తుందని అన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ధర్నా చేస్తూ ఢిల్లీలో సుమారు 700మందికిపైగా రైతులు మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కారుతో తొక్కించి ప్రాణాలు పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోగా అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అందుకు కారకుడైన మంత్రి కుమారుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, కె రామస్వామి, మర్రివాడ వెంకట్రావు, మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, దీపాల సత్యనారాయణ, జి నాగరాజు, బట్టు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌బికె చైర్మన్

సాయం చేయడంలోనే ఆనందం

ప్రజశక్తి - చీరాల

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని కావూరివారిపాలెంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం మంగళవారం వన మహెూత్సవంతో ఘనంగా నిర్వహించారు. చెట్లను రహదారులకు ఇరువైపులా నాటారు. క్యాంపు ముగింపు సభలో విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డాక్టర్ వై రాధా విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. మానవసేవే మాధవసేవని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు , వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్, ఫుడ్ సైన్స్ కాలేజ్ సీనియర్ ఉపాధ్యాయిలు డాక్టర్ సిహెచ్‌వివి సత్యనారాయణ మాట్లాడారు. సభలో చీరాల ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి మాట్లాడుతూ ఇతరులకు సహాయపడడంలో ఆనందాన్ని వెదికే దిశగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంతో ఉత్సాహంతో పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ విమల బీర, డాక్టర్ బ్లేస్సి సాగర్, డాక్టర్ ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

కళాకారులు 5లోగా దరఖాస్తులివ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల జిల్లాలో కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ సన్నాహాలు చేస్తుంద డిపిఆర్ఓ రాజు తెలిపారు. విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. జిల్లాలో కళాకారులు తమ ధ్రువీకరణ పత్రాలులతో నేరుగా జిల్లా కలెక్టరేట్‌లోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఈనెల 5లోగా దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

జగనన్న సురక్షతో ఆరోగ్యరక్ష

ఉచిత వైద్యపరీక్షలు
ఉచితంగా మందులు పంపిణీ



జగనన్న సురక్షలో కిట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ రఘుపతి



సురక్ష వైద్యశిభిరంలో ఎంఎల్‌సి పోతుల సునీత



వైద్యశిభిరంలో ఎంపిడిఒ కృష్ణకుమారి, ఎంపిపి రజిని

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల చెంతకే వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంఎల్ఎ కొన రఘుపతి అన్నారు. మండలంలోని బేతపూడిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అంద చేస్తామన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచితంగా మందులు అందిస్తున్నామని అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నామనే విషయంపై ఇక్కడ వివరిస్తామని అన్నారు. మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేస్తారని చెప్పారు. సంపూర్ణ పౌష్ఠికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ పాల్గొన్నారు.

చుండూరు : స్థానిక అంబేద్కర్ నగర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష ఉచిత వైద్య శిబరం మంగళవారం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి డాక్టర్స్ పరీక్షల నిర్వహించారు. అనారోగ్యం ఉన్న వారికి వెంటనే మందులు అందజేశారు. అనారోగ్యంతో ఉన్న వారందరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి ఎంపిడిఓ సుగుణ కుమారి, ఎంపీపీ జాలాది రూబెన్, సర్పంచ్ మేడికొండూరు విజయభాస్కర్, డాక్టర్ ఎఎన్ఎంలు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రామలక్ష్మి

బట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యులు సిహెచ్ రామలక్ష్మి, కృపా సుమతి, గైనకాలజిస్ట్ జి రాజేశ్వరి, రమాకాంత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు, ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి ఉదయ భాస్కరి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలా ఉషారాణి, డిఆర్డిఏ పిడి అర్జునరావు, ఎంఈఓ నీలం దేవరాజ్, పులి లాజర్, ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర్, తాసిల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని యనమదల యుపి పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణ కుమారి మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు 42మందికి కళ్ళ జోళ్లు సిఫార్స్ చేశారు. 10మందికి ఆపరేషన్ అసరమని సూచించినట్లు డాక్టర్ సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్ఎ చంద్రసుమన్‌రెడ్డి, వినీత, నిహారిక, హరిక్రిష్ణ, సిహెచ్ సుభాషిణి, వీరబాబు, సర్పంచ్ పృథ్వీరాజ్, ఎంపిపి రజని, పంచాయితీ కార్యదర్శి ఎ రాణీ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని పూసపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం మంగళవారం జరిగింది. సర్పంచ్ పాలూరి రమాదేవి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు నిహారిక, అంజలి, రాజేష్, సజన్, విజయన్ 362మంది రోగులను పరీక్షించి ఉచిత వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎంపిడిఓ రాజ్యలక్ష్మి, ఇఓఆర్‌డి ఎ శ్రీనివాస్, ఉపసర్పంచ్ కంకట రాంబాబులు, గ్రామ కార్యదర్శి సురేష్, సిహెచ్ఓ బివి కోటేశ్వరరావు, పిహెచ్ ఎన్ సహస్ర, సూపర్‌వైజర్ ప్రభావతి పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న నగరం ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

నగరం : ప్రజల ఆరోగ్య భద్రతే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాన్ని అయన ప్రారంభించారు. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకొచ్చారని అన్నారు. పేదలు అనారోగ్యం కారణంగా అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమల్లోకి తెచ్చారని ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారని అన్నారు. వేల రకాల జబ్బులకు వైద్యం చేసే విధంగా పథకం పరిధిని పెంచారని అన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది శిబిరాల్లో వైద్యపరీక్షలు చేస్తారని చెప్పారు. ఆరోగ్య సమస్యలుంటే ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా మెరుగైన చికిత్స, మందులు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి నాగమణి, సర్పంచ్ రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు రవికుమార్, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్ సైదా నాయక్, తహాసిల్దార్ ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాని ప్రసాద్ పాల్గొన్నారు.



బిపి పరీక్ష చేయించుకుంటున్న వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

సంతమాగులూరు : పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసీపీ కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలోని ఏల్చూరు 1వ సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య శిబిరాన్ని, ల్యాబ్ టెస్టింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి మందా సూరిబాబు, మండల ప్రత్యేక అధికారి రాజేష్, వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, ఎఎంసి మాజీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, గాలెయ్య, నాగభోతు రామాంజనేయులు పాల్గొన్నారు.

వేటపాలెం : జగనన్న సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని జిల్లా జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. కొత్తపేటలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష ఆయన ఎంఎల్‌సి పోతుల సునీతతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజా దెబోరా, ఎంపీడీవో రూపమ్మ, తహసిల్దార్ అశోకవర్ధన్, ఈఓఆర్డి శ్రీలక్ష్మి, జడ్పిటిసి బండ్ల తిరుమలాదేవి, ఎఎంసి చైర్మన్ మార్పు గ్రెగోరి, మిరియాల శ్రీనివాసరావు, వి సుబ్బారావు, బండ్ల బాబు, మాజీ సర్పంచ్ చుండూరు వాసు, గుమ్మడి రత్నరావు, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

రాజకీయ నేత చెన్నయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - పంగులూరు



పూసల చెన్నయ్య (84)

సీనియర్ రాజకీయ నాయకులు పూసల చెన్నయ్య (84) మంగళవారం ముప్పవరంలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మరణించారు. ఆయన కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. చాలా హుషారుగా ఉండే ఆయన ఆదివారం కొంత ఇబ్బందిపడ్డారు. వెంటనే గుంటూరు హాస్పిటల్‌కి వెళ్లి పరీక్షలు చేయించుకుని వచ్చారు. సోమవారం ఉదయం ముప్పవరంలోని ఆయన స్వగృహంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మరణించారు. కాంగ్రెస్ నాయకునిగా సుపరిచితులు. పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. తర్వాత కాలంలో అనేక పదవులను పొందాడు. సింగరకొండ ట్రస్ట్ బోర్డు సభ్యునిగా, అద్దంకి ఎఎంసి సభ్యునిగా, జాగర్లమూడివారిపాలెం వ్యవసాయ పరపతి సంఘం సభ్యుడిగా సేవలు అందించారు. గ్రామాభివృద్ధిలో చెన్నయ్య కృషిని పలువురు గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులకు రుణ మంజూరులో ఆయన కృషి రైతులకు ఎంతో మేలు చేసిందని అన్నారు. ప్రజలతో మమేకయ్యే చెన్నయ్య మృతి తీరని లోటని అన్నారు. చెన్నయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కాగా, పెద్ద కుమారుడు పూసల రఘురామయ్య మండలంలోని అలవలపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు ఇటీవల కాలంలో మరణించగా, మూడో కుమారుడు పూసల గంగాధర్ ముప్పవరం ఎంపీటీసీ సభ్యునిగా పనిచేస్తున్నారు. చెన్నయ్య భౌతిక కాయాన్ని అద్దంకి వైసిపి ఇన్చార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, వైసిపి పంగులూరు మండల అధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ముప్పవరం సర్పంచ్ సాంబశివరావు, కోటపాడు మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి, వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు పులికం పోలిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకట సుబ్బారావు, వైసీపీ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, పలువు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. చెన్నయ్య మృతికి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, ధూళిపాళ్ల రామచంద్రప్రసాద్ ఉన్నారు. చెన్నయ్య అంత్యక్రియలు బుధవారం జరుగుతాయని పెద్ద కుమారుడు రఘురామయ్య తెలిపారు.



పూసల చెన్నయ్యకు నివాళి అర్పిస్తున్న కృష్ణచైతన్య

ఆరోగ్య సురక్ష ఎంతో ఉపయోగకరం

వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో ఉపయోగకరం అని కొండపి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని అనకర్లపూడి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వరికూటి అశోక్‌బాబు ప్రారంబించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మీ ఇంటి వద్దే వైద్య పరీక్షలు కూడా చేయించడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామాలలో ఉండే పేదలకు పక్కాగా నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పెట్టడం జరిగిందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు వైద్యం అందించటమే సిఎం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో తహాశీల్దారు పి.సింగరావు, డాక్టర్లు పి.అనుషా, లీనారాఫ్‌హెల్, డి.కీర్తి, నిక్‌హిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకూరి కోటయ్య, జె.సి.యస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ యంపిపి వేముల ప్రసాద్, సర్పంచ్ ధనలక్ష్మి, గ్రామ నాయకులు నరసింహరావు, బచ్చల కోటు, పర్చూరి శ్రీను, మండలంలోని నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లపాలెంలో..

శింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో మంగళవారం నాడు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైసీపీ నేత సామంతుల రవికుమార్‌రెడ్డి హాజరయ్యి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. డాక్టర్ భగీరథ హాజరయ్యి పాఠశాల విద్యార్థులకు కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ, డాక్టర్ చైతన్య కష్ణ, డాక్టర్ వంశీధర్, డాక్టర్ ఉజ్వల, డాక్టర్ ధీరజ్ కుమార్, పాకనాటి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, పీవీరెడ్డి పాల్గొన్నారు.

వీపీఎం జీవన ఎరువు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

విఏయం జీవన ఎరువులు వాడటం వల్ల వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెంది, మొక్కకు లభ్యం కాని స్థితిలో ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందించడంతో పాటు తెగుళ్లను తట్టుకొనే శక్తిని పెంచుతుందని ఆత్మా పీడీ, జిల్లా వనరుల కేంద్రం హెడ్ కె.అన్నపూర్ణ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మూగచింతల ఆర్‌బికే పరిదిలోని గుర్రపడియ గ్రామంలో మిరప సాగు చేసే రైతులకు జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు వారు ఆత్మా పథకము 2023-24 క్రింద మిరప సాగుచేసే 10 మంది రైతులకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున విఏయం జీవన ఎరువును ఉచితంగా పంపిణీ చేశారు. విఏయం జీవన ఎరువును పశువుల ఎరువుతో కలిపి రైతుపొలంలో ప్రయోగాత్మకంగా చేసి చూపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కె.అన్నపూర్ణ మాట్లాడుతూ విఏయం ఎరువుల వల్ల మొక్కకు కొన్ని రకాల హార్మోన్లు, సూక్ష్మపోషకాలను కూడా అందిస్తుందన్నారు. అనంతరం గుర్రపడియ , అనకర్లపూడి, నెన్నూరుపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని ఎప్‌పిజిఎస్ రైతు ఉత్పత్తి సంఘాల రైతులకు వారు సాగుచేసే పంటలలో చేపట్టవలసిన మీలైన యాజమాన్య పద్దతులు గురించి రైతులకు వివరించారు. కంది, వరి, మిరప, శనగ మినుము, అలసంద, పొగాకు పంటలలో ఆశించే పురుగులు, తెగుళ్ల వాటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అనంతరం వివిద పంటలకు సంబందించిన సాంకేతిక సమాచారాన్ని పుస్తక రూపంలో రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవోలు శైలజ, శేషమ్మ, కొండపి మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, గుర్రపడియ గ్రామ సర్పంచ్ ఆళ్ల సుజాత, శ్రీనివాసులరెడ్డి, విఏఏలు వెంకటరావు, శ్రీకాంత్, జ్యోత్స్న, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను పూర్తి చేసేందుకు

సమిష్టిగా కృషి చేయాలి: జేసీ



పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

ప్రజాశక్తి-వేటపాలెం

జగనన్న కాలనీలను సమిష్టి కషితో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ చామకూరు శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెల్లారెడ్డి పాలెం పంచాయితీ కొంజేటి నగర్ జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు త్వరలో ప్రారంభోత్సవం ఉంటుందని కాబట్టి అధికారులు సమిష్టి కషితో కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే తన దష్టికి తేవాలని చెప్పారు. మొత్తం కాలనీలో 208 ఇల్లు పూర్తయ్యాయని మరో 40 వివిధ దశలలో ఉన్నాయని, వాటిపైన ఎక్కువ దష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి జేవిఎస్కే ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి రామకష్ణ, పంచాయతీరాజ్ శాఖ ఈఈ రామకష్ణ, డి స్వర్ణ శేషయ్య, హౌసింగ్ డిఇ గోవింద్ రెడ్డి, ఏఈలు రామ్‌కమార్, సుబ్బారావు, బాషా, శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి రాజా దిబోరా, ఎంపీడీవో కె.రుతమ్మ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సిఎం జగన్ పెద్దపీట

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక డిఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాల ఆవరణలో ఆరు డివిజన్లకు సంబంధించిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలు అంతా సంతోషంగా ఉండాలని సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. క్యాంపుల ద్వారా వివిధ రకాల మెడికల్ పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం జరుగుతోందన్నారు. ఎవరూ కూడా అనారోగ్యంతో బాధపడకూడదనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గతంలో ఎన్నడూ చూడలేదని, ప్రజల పక్షాన పనిచేసే ప్రభుత్వానికే ప్రజల ఇబ్బందులు తెలుస్తున్నాయని వివరించారు. అనంతరం మెడికల్ క్యాంపులో బాలినేని శ్రీనివాసరెడ్డి షుగర్ పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, చింతపల్లి గోపి, కొప్పెర్ల కమల, శ్రీరాం నాగభూషణం, కార్పొరేషన్ ఇంజినీర్ జానీ, వైసిపి నగర కన్వీనర్ కఠారి శంకర్, నాయకులు పసుపులేటి శ్రీను, అక్కిరెడ్డి, నత్తల భీమేష్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి మణిలాల్




మాట్లాడుతున్న మణిలాల్

ప్రజాశక్తి-రేపల్లె

నాలుగేళ్ల నుంచి పూర్తి చేసి.. ఇస్తామంటూ.. రేపల్లె పట్టణంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా పాలకులు కాలం గడుపుతున్నారని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ అన్నారు. స్థానిక సిపిఎం రేపల్లె కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిహెచ్.మణిలాల్ మాట్లాడారు. రేపల్లె పట్టణంలో 1300 మంది టిడ్కో లబ్ధిదారులు గత ప్రభుత్వంలో రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించి.. తమకు ఇల్లు వస్తుందని ఆనందపడ్డారని, కానీ ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక కూడా పెట్టకుండా పనిని అర్థాంతరంగా ఆపివేశారని చెప్పారు. పలు పర్యాయాలు ప్రజాప్రతినిధులకి, మున్సిపల్ అధికారులకి వేడుకున్నప్పటికీ మాటలు చెబుతూ కాలం గడిపారన్నారు. ఉద్దేశపూర్వకంగానే టిడ్కో ఇళ్లు పూర్తి చేయలేదేమో అనిపిస్తుందన్నారు. లబ్ధిదారులను బ్యాంకులతో అగ్రిమెంట్ చేయించి లక్షల రూపాయలు అప్పులు చేయించారని, వడ్డీలు పెరుగుతున్నాయని తెలిపారు. కనీసం వాటి గురించి మాట్లాడటం గానీ, కౌన్సిల్‌లో చర్చించడం గానీ చేయకపోవడంతో ఎన్నికలు సమయంలో ఇప్పుడైనా పట్టించుచువాలని భాదితులు వాపోతున్నారు. రేపల్లె మున్సిపల్ పట్టణంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల పట్టాలు కొంత మంది లబ్ధిదారులకు అందకపోవటంతో మా ఇళ్ల పట్టా ఇవ్వండి అని మున్సిపల్ కార్యాలయం, స్థానిక కౌన్సిలర్ల దగ్గరికి తిరుగుతున్నప్పటికీ వాయిదాలు వేస్తున్నారని చెప్పారు. వెంటనే లిస్టులో ప్రకటించిన విధంగా అర్హులైన లబ్ధిదారుల ఇళ్ళ పట్టాలను అందజేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం దగ్గర ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం రేపల్లె పట్టణ నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్ పాల్గొన్నారు.

వైసిపి కుటుంబాలకు బూచేపల్లి పరామర్శ

హైస్కూల్ స్థల సేకరణకు రూ.5 లక్షల సొంత నిధులు మంజూరు



వైసిపి నాయకులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కురిచేడు

మండలంలోని పలు వైసిపి కార్యకర్తల కుటుంబాలను దర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరామర్శించారు. ముందుగా మండంలోని పడమర నాయుడుపాలెం గ్రామంలో వైసిపి మాజీ మండల కన్వీనర్ బొమ్మనబోయిన వెంకయ్య అనారోగ్యానికి గురవగా ఆయనను బూచేపల్లి పరామర్శించి.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కురిచేడులోని వాల్మీకీ బజార్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మీనిగ వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్య రమాదేవికి రూ.25 వేలు అందజేశారు. అనంతరం కురిచేడు పంచాయతీ పరిధిలోని కాటంవారిపల్లె గ్రామంలో పార్టీ కార్యకర్త కాట్రెడ్డి రమణారెడ్డి భార్య అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

స్వంత నిధులతో హైస్కూల్ స్థలసేకరణ

మండలంలోని పడమర నాయుడుపాలెంలోని హైస్కూల్‌కు తన తండ్రి దర్శి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం శివప్రసాద్‌ఱెడ్డి స్వంత నిధులు మంజూరు చేశారు. కురిచేడుకు చెందిన నాగరాజుకి మూడు చక్రాల బండిని కేటాయించమని అడుగగా వెంటనే తమ ట్రస్టు నుండి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్.పి.టి.సి. నుసుం వెంకట నాగిరెడ్డి, మాజీ యం.పి.పి.లు వీరగంధం కోటయ్య, మేరువ సుబ్బారెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ బాషా, నాయకులు మేరువ పిచ్చిరెడ్డి, కురిచేడు గ్రామ సర్పంచ్ కేశనపల్లి క్రిష్ణయ్య, నుసుం ప్రతాపరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, యం.పి.టి.సి. బుల్లం వెంకట నరసయ్య, వైసిపి టౌన్ అధ్యక్షులు రమణారెడ్డి, మరియు దర్శి మాజీ యం.పి.పి. ఇత్తడి దేవదానం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడి వాణిశ్రీ

ఏ గ్రేడ్ మోడల్‌గా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రకృతి వ్యవసాయంలో వరి పంటను ఈ ఏడాది ఏ గ్రేడ్ మోడల్‌గా తీర్చిదిద్దాలని బాపట్ల డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ సూచించారు. స్థానిక 2వ ఆర్‌బికెలో మంగళవారం 12మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ప్రస్తుతం వరి పైరకు నామ తెగులు, ఆకు ముడత వ్యాపించి ఉందని అన్నారు. దీని నివారణకు రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కషాయాలను తయారుచేసి పిచికారి చేయించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి పంటలు అప్పగించే రైతుల జాబితాలను సీఎం యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. చీడ, పీడల నివారణకు గాను పేడ, మూత్రం, ఇంగువ ద్రావణాన్ని, ఆకుముడత నివారణకు నీమాస్త్రం తయారుచేసి పిచికారి చేస్తే పూర్తిగా నివారించ బడతాయని అన్నారు. మండలాల వారీగా పనిచేసే సిబ్బంది నుండి తగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎల్‌ఎం పి మోహనరావు, బివి శ్రీనివాసరావు, రవి, శ్రీవల్లి, వందనం, ఎంఎల్పీలు ఝాన్సీ, పాండురంగారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సిడిపిఒ కృష్ణకుమారి

పోషకాహారం ద్వారా ఆరోగ్యం

ప్రజాశక్తి - పంగులూరు

సమాజంలో అన్నిటికన్నా ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా విలువైన జీవితాన్ని పొందవచ్చని ఐసిడిఎస్ కోరిసపాడు ప్రాజెక్టు సిడిపిఓ అద్దంకి కృష్ణకుమారి అన్నారు. జగనన్న ఆరోగ్య సంరక్షలో భాగంగా మంగళవారం మండలంలోని బైటమంజులూరులో ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు పోషకాహార స్టాల్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. అందు కోసం పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. గర్భ వతులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్న పిల్లలకు పుష్టి కరమైన ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. గర్భవతులు గా ఉన్నప్పుడే మంచి ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డకు, తల్లికి ఆరోగ్యమని అన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లల పుడితే దేశానికి ఎంతో ఉపయోగమని అన్నారు. హాజరైన ప్రజలందరికీ అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పంగులూరు సెక్టర్ సూపర్వైజర్ జయప్రద, ముప్పవరం సెక్టార్ సూపర్వైజర్ పద్మజ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నేడు అందుబాటులో గుండె డాక్టర్ పేరయ్య

ప్రజాశక్తి - చీరాల



డాక్టర్ పేరయ్య

జివిఆర్ హాస్పిటల్ ల్లో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బండ్లమూడి పేరయ్య చౌదరి బుధ వారం అందుబాటులో ఉంటారని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పల్లె ప్రదీప్ రతన్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండానే చీరాల ప్రాంతంలో రవి పార్సిల్ ప్రక్కన స్థానిక జివిఆర్ హాస్పిటల్‌ల్లోనే ప్రతి బుధవారం అందుబాటులో ఉంటారని తెలిపారు. గుండె నొప్పి, గుండె దడ, ఆయాసం వంటి సమస్యలకు ఈసీజీ, ఎకో, టిఎంటి టెస్టులు, చికిత్సలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని చీరాల ప్రాంతవాసులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. 24గంటలు తమ హాస్పిటల్‌లో అన్ని ఎమర్జెన్సీ క్రిటికల్, జనరల్ కేసులకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు.

ప్రజలను వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

◆ డెంగ్యూ మలేరియా లక్షణాలతో ప్రజల ఇబ్బందులు ◆ పారిశుద్ధ్యం లేకపోవడమే ప్రధాన కారణం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ ఇంటికి వెళ్లిన జ్వరపీడితులు ఉంటున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా దగ్గు, జలుబు, జ్వరంతో పెద్ద సంఖ్యలో జనం బాధపడుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతీ వర్షాకాలంలో వైరల్ వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఈసారి దగ్గు, జలుబు, జ్వరం, ఒంటినొప్పుల వంటి సమస్యలు రోజుల తరబడి ఉండడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. రోజు రోజుకూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. జలుబు, దగ్గు, విరేచనాలు, జ్వరంతో ఎక్కువ మంది ఆసుపత్రుల్లో చేరుతున్నారని వైద్యవర్గాలు చెబుతున్నాయి. దోమ



కాటుతో ఒకరి నుంచి మరొకరికి వేగంగా వైరల్ జ్వరాలు అంటుకుంటున్నాయి. ప్రతీ 30 మందిలో ఒకరు జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యలు ప్రాథమికంగా అంచనా వేశారు. వైరల్ ఫీవర్స్ బాధితుల సంఖ్య పెరిగిపోతుండడంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల రోజువారీ ఓపీల్లో ముప్పాతికవంతు జ్వర పీడితులే ఉంటున్నారంటే విష జ్వరాల వ్యాప్తి ఎంత వేగంగా ఉందో అర్థమవుతోంది. విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఎఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. మాస్కులు ధరించకుండా భౌతిక దూరం పాటించకపోవడంతో విష జ్వరాలతోపాటు శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

వివరణ: విష జ్వరాల విషయంలో ప్రజలు భయాందోళన చెందవద్దని, జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో వైద్యం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ వి సుధాకరం సూచించారు. అర్బన్ ఫ్యామిలీ హెల్త్ అండ్ వెల్ఫేర్ సెంటర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో వైద సిబ్బంది, ఆశా వర్కర్లను అప్రమత్తం చేశామని చెప్పారు. పీహెచ్‌సీల్లో, ఆసుపత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నారులకు తీవ్రమైన జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని సూచించారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలి

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల ఆవరణలోని పార్క్, చిల్డ్రన్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. మున్సిపల్ పిల్లల పార్కులో ఆట వస్తువులు పరిశీలించారు. అక్కడ వసతులపై చిన్నారుల



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

తల్లి దండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, మునిసిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి, డిఇ ఐసయ్య, ఎఇలు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

(మొదటిపేజీ తరువాయి)

యాక్సెప్టెన్సీ టెస్ట్ ప్రొసీజర్ నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయపార్టీల సమక్షంలో జరగాలన్నారు. అత్యంత పారదర్శకతతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి అధికారులు విధులు నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించిన యంత్రాలను వేర్వేరుగా భద్రపరచాలన్నారు. కలెక్టర్ వెంట బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కష్ణకాంత్, తహశీల్దార్ సుధారాణి పాల్గొన్నారు.

రైల్వే గేట్లు.. దాటాలంటే నరకమే..

రోడ్లకు అడ్డంగా నిలిచిపోతున్న వాహనాలు

అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు

ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - చీరాల

రైలు పట్టాలకు పడమరవైపు 11వార్డుల ప్రజలు నివాసం ఉంటున్నారు. నిత్యం ఏదో ఒక పనిపై పట్టణంలోకి వచ్చి వెళ్లాల్సిందే. అయితే వాహనదారులు రైల్వే గేట్లు దాటాలంటే నరకాన్ని తలపిస్తుందని అంటున్నారు. ప్రధానంగా స్కూల్, కళాశాల బస్సులలో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు నిర్ణయిత సమయాలకు చేరుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు పడిందంటే గేట్ల వద్ద వాహనదారులు రోడ్లపై ఇష్టం వచ్చినట్లు నిలుపుతున్నారు. దీంతో అటుగా ప్రయాణించే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గేటు తీశారంటే అందరూ ఒక్కసారిగా ఎదురు వచ్చే వాహనాలకు అడ్డంగా వెళుతుంటారు. ఎవ్వరూ తగ్గరు. ఎవరికి వాళ్లే ముందు వెళ్లాలనే ఆతృతతో ట్రాఫిక్ మరింత జటిలం చేస్తుంటారు. గతంలో కారంచేడు గేటు సెంటర్లో ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తూ ఉండేవారు. వాహనాలను వరుస క్రమంలో పంపిస్తూ ట్రాఫిక్కు అంతరాయం లేకుండా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనాలను గేట్లకి ఇరువైపులా అడ్డగోలుగా నిలుపుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అదే సమయంలో అత్యవసర సేవలు అందించే 108వాహనాలు వచ్చినప్పటికీ ట్రాఫిక్ వలయంలో చిక్కుకోవాల్సిందే. వాటికి కూడా దారివ్వడంలేదు. ఈ నేపద్యంలో కారంచేడు నుండి రాకపోకలు సాగించే వాహనాలు ఆర్‌ఓబి నుండి పట్టణంలోనికి వచ్చేందుకు కొంత వెసులుబాటు ఉండడంతో కొంతవరకు ట్రాఫిక్ సమస్య తగ్గినట్లే అని చెప్పవచ్చు. అయితే దూరప్రాంతాల నుండి పెద్దపెద్ద కంటైనర్లు కారంచేడు గేటు మీదగా పట్టణంలోనికి ప్రవేశిస్తూ ఉండటంతో అవి రోడ్డు మొత్తం ఆక్రమించి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అదే విధంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఫైర్‌స్టేషన్ రైల్వే గేటు రైలు వెళ్లిన వెంటనే తీయరు. నాలుగు, ఐదు రైళ్లు వెళ్లేవరకు గేటు తీయరు. దీంతో గేటు వద్ద నిత్యం పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ఉంటాయి. ఆ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులకు తలనొప్పిగా మారుతుంది. గేటు దాటి రావాలంటే ఆటోలు, రిక్షాలు కూడా ఎవ్వరూ రావడంలేదు. వస్తే గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తుంది. కాబట్టి వాళ్లకు వచ్చే ఇతర బాగులు కోల్పోవాల్సి వస్తుందనే కారణంతో పట్టాలు దాటి రావడానికి అదనపు ఛార్జీలు



కారంచేడు గేటు సెంటర్లో ఆగిన వాహనాలు

అడుగుతున్నారు. ఫైర్‌స్టేషన్ గేటు వద్ద ఆర్‌ఒబి బ్రిడ్జి నిర్మాణం జరగాల్సి ఉంది. వంతెన నిర్మాణానికి కొలతలు తీశారు. నిధులు మంజూరయ్యాయి. రైల్వే అధికారులు అనుమతించారు. నిర్మాణ పనులు ప్రారంభించే దశలో ఎన్నికలు వచ్చాయి. పనులు ఆగిపోయాయి. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వంతెన పనులు మరుగున పడిపోయాయి. అయితే ఏళ్లు గడుస్తున్న నిర్మాణం జరగకపోవడంతో ఆ ప్రాంత వాసులందరూ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. స్వర్ణ గేటు వద్ద కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదు. గేటు పడ్డ సమయంలో ఆగిన వాహనాలన్నీ గేటు తీసిన వెంటనే క్రమపద్ధతిలో కాకుండా ఒకరికి ఒకరు ఎదరు వెళు తుండటంతో మరింత ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈతరణంలో రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్కు అంతరాయం లేకుండా వాహన రాకపోకలు జరిగేలా పోలీసు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా కంటైనర్ వాహనం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి దీక్షలు

అద్దంకి ఎంఎల్ఎ గొట్టిపాటి సైకిల్ ర్యాలీ

బాపట్లలో న్యాయదేవత వేషధారణలో

ఊపందుకున్న నిరసనలు



న్యాయదేవత రూపంలో బాపట్లలో టిడిపి నిరసన



చీరాల నిరసన దీక్షలో టిడిపి ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య



కొల్లూరు మండలం కిష్కిందపాలెం దీక్షలో నక్క ఆనందబాబు

ప్రజాశక్తి - రేపల్లె

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ ఆందోళనలు 19వ రోజూ కొనసాగాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా అన్యాయంగా చంద్రబాబును అరెస్ట్ చేశారని టీడీపీ నేతలు, కార్యకర్తలు ముక్తకంఠంతో నినదించారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులో ఇరికించారని సామాన్య ప్రజలకు సైతం అర్థమైందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అరాచక ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనగాని శివప్రసాద్, జీవి నాగేశ్వరరావు, జీవి రామారావు, ఎస్టి సేల్ జిల్లా అధ్యక్షులు మద్దుల అంకాలు, నియోజకవర్గ ఎస్టీ అధ్యక్షులు ఆంజనేయులు, కుంభ తిరుపతయ్య, కుంభా నాగేశ్వరరావు, సజ్జ రమేష్, మేడ వెంకటేశ్వరరావు, మద్దుల నాగరాజు, మద్దుల నాగమల్లి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని కిష్కిందపాలెం సెంటర్లో చంద్రబాబు అక్రమ అరెస్టు వ్యతిరేకిస్తూ నిరసనగా మంగళవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రం కోసం, ప్రజల కోసం చంద్రబాబు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. ఆయనను ఇబ్బందులు పెట్టడం బాధాకరమని అన్నారు. ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి ఆయనకు రెండు కళ్ళు లాంటివని అన్నారు. స్కిల్ కేంద్రంలో శిక్షణ పొందిన 80వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. సైకో జగన్ సాగిస్తున్న విధ్వంస పాలనపై ప్రజలు చైతన్యవంతులై వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీ కృష్ణ, వేమూరు ఎఎంసి మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, కొల్లూరు మండల మాజీ ఎంపీపీ కనగాల మధుసూధన ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కారంచేడు : చంద్రబాబు అక్రమ అరెస్టు, రిమాండును వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం వద్ద 25వ రోజు దీక్షలు చేశారు. ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అధ్యక్షతన జరిగిన దీక్షల్లో అరెస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంభంపాటి నరేంద్ర, మహిళా నాయకులు పాతూరి ఆదిలక్ష్మి, అకుల లక్ష్మి, రఘూన్సీ, ధనలక్ష్మి, యర్లగడ్డ ఆంజనేయులు, అంబటి సుబ్బారావు, పివి వెంకటేష్, పాతూరి శివరాం, బోయిన్ శీను, భీముడు, తాళ్లూరి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

బాపట్ల : అక్రమ కేసులతో జ్యుడీషియల్ కస్టడీలో ఉంచిన చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని తెలుగు మహిళలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలో మంగళవారం నిర్వహించారు. మహిళలు ఆగ్రహిస్తే సిఎం జగన్ నామ రూపాల్లే కుండా పోతాడని హెచ్చరించారు. చంద్రబాబుకు తోడుగా నియంతపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇనగంటి గాంధీ, దొప్పలపూడి రామ్మోహనరావు, భవనం బసివిరెడ్డి, కామేపల్లి కృషి బాబు పాల్గొన్నారు.

అద్దంకి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మంగళవారం 21వ రోజు నిర్వహించారు. బల్లికురవ క్లస్టర్ ఇన్చార్జి మలినీడి గోవిందరావు, కొణిదన మాజీ సర్పంచ్ చెరుకురు ఆంజనేయులు, ధూళిపాళ్ల హనుమంతరావు, చింతల రామా రావు, పి ప్రసాద్, కె లక్ష్మయ్య, జి సామ్యేలు, ఏసుబాబు, ఉమా మహేష్, కామేశ్వరరావు తదితరులు దీక్షలో ఉన్నారు. వారికి నాగినేని రామకృష్ణ, త్రిమూర్తులు దీక్ష కండువాలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మలినీడి గోవిందరావు మాట్లాడుతూ అన్యాయంగా చంద్ర బాబును అరెస్టు చేయడమే కాకుండా ఇబ్బంది పెట్టడానికి సిఐడి పోలీసులు సీఎం జగన్ కు తొత్తులుగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బొంతు దావీదు, షేక్ మహబూబ్, అబ్దుల్ రహీం, మలినేడి రాంబాబు, దొడ్డ వేణు గోపాల్, కె ఇజ్రాయిల్, శేఖర్ పాల్గొన్నారు.

చీరాల : చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి ఇంచార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో రిలే దీక్షలు బుధవారం నాటికీ 21రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్బంగా కొండయ్య మాట్లాడుతూ వైసీపీ రాజకీయ లబ్ది కోసమే చంద్ర బాబును అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. కడిగిన ముత్యంలా త్వరలోనే బయటకు వస్తారని, అప్పటి వరకు ధైర్యంగా ఉండాలని అన్నారు. దీక్షలో బిట్రా చైతన్య, షేక్ ఫర్హాన, వెంకటేష్,షేక్ రజాక్, గరికిన చిన్న, కీర్తి ప్రసాద్, చౌటుపల్లి రాజు, బాలాజీ, నవీన్, ప్రదీప్ పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో ఎంఎల్ఎ గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

వైసిపి అరాచకాలను చంద్రబాబు, లోకేష్, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎండగట్టినందుకే చంద్రబాబును ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా అడ్డరోడ్డు జంక్షన్ నుండి కామేపల్లి ఎన్టీఆర్ విగ్రహం వరకు సైకిల్ ర్యాలి నిర్వహించారు. మూడు కిలోమీటర్ల దూరం రవికుమార్ సైకిల్ తొక్కుతూ ర్యాలీకి ముందు వరుసలో ఉన్నారు. కామేపల్లి ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వలో రాష్ట్రంలో 40 స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు పెట్టి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించాలన్నదే లక్ష్యంగా పనిచేసి 80వేల మందికిపైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అందుకే తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో బాబు అరెస్టుకు నిరసన తెలిపారని అన్నారు. 25ఏళ్లకే ఎమ్మెల్యేగా, 28 ఏళ్లకే మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని అన్నారు. నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు అనేక సవాళ్లను ఎదుర్కొని రాష్ట్రాన్ని నడిపించారని అన్నారు. ప్రపంచంలోనే ఎవరికి సాధ్యపడని విధంగా రాజధాని కోసం 33వేల ఎకరాలు రైతుల దగ్గర నుంచి పూలింగ్ పద్ధతిలో సేకరించడం చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. నేడు జగన్‌రెడ్డి అమరావతిని నాశనం చేయడమే కాకుండా స్మశానంతో పోలుస్తూ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏడుకొండలు, గొట్టిపాటి చౌదరిబాబు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసు రెడ్డి, కొనికి గోవిందమ్మ, ధూపాటి ఏసోబు, గుండపునేని సురేష్, గాడిపర్తి రాంబాబు, పసుపులేటి కోటేశ్వరరావు, దేవా, శ్రీనివాసరావు, మాదాల సుబ్బారావు, గమిడి కోటేశ్వరరావు, నంబుల కొండలు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసిపి

శాసనసభ్యులు

అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

వైసీపీ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీపై రోజురోజుకు ప్రజా వ్యతిరేఖత పెరుగుతుందని అన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరు లేకున్నా కక్షపూరితంగా జగన్ ప్రభుత్వం ఇరికించిందన్నారు. జగన్‌రెడ్డి జైలుకు వెళ్లిన విషయం టిడిపికి సంబంధం లేదన్నారు, వైఎస్ రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్నప్పుడు 2004-2009మధ్యలో చేసిన అవకతవకలు లక్షల కోట్లలో ఉండటం అప్పటి సీబీఐ రూ.45 వేల కోట్లను గుర్తించిందని అన్నారు. అందులో రూ.5వేల కోట్లను సీజ్ చేయడం రాష్ట్ర ప్రజలకు గుర్తుందని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌లో ఎటువంటి అక్రమాలు జరుగలేదని ఆ సంస్థ సీఈవో స్వయంగా వెల్లడించినా సీఐడీ అక్రమంగా చంద్రబాబుకు రిమాండ్ విధించడం సరికాదన్నారు. తప్పు చేయకపోయినా 25రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లి వచ్చాడు కాబట్టి ప్రతిపక్ష నేతలను కూడా జైల్లో పెట్టి చూడాలని అనుకుంటున్నాడని అన్నారు. వైసిపి అరాచకాలను ప్రశ్నించే వారిని కేసుల్లో ఇరికించడం సైకో సీఎంకు అలవాటుగా మారిందన్నారు.



విలేకర్ల సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

రాష్ట్ర విభజన అనంతరం నూతన రాజధాని నిర్మాణంతోపాటు యువత కు బంగారు భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తీసుకువచ్చినట్లు తెలిపారు. సుమారు రూ.2.13లక్షల మంది శిక్షణ పొందగా 72వేల మంది ఉద్యోగాలు పొందారని చెప్పారు. బండారు సత్య నారాయణ అరెస్టు బాధాకరమని అన్నారు. అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. చెరుకూరు మండలంలో అమర్నాథ్ హత్య విషయంలో వైసిపి నాయకులు కుల రాజకీయాల ప్రస్తావన చేయటం సిగ్గుచేటు అన్నారు. హత్య జరిగిన వెంటనే ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు రూరల్ సీఐ శివశంకర్ ప్రయత్నించటంతో ఆరోజు కుల సంఘాలన్నీ ఏకమై అమర్నాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అమర్నాథ్ హత్యను కులానికి ఆపాదించడం దుర్మార్గమన్నారు. వినాయక చవితి ఉత్సవాలలో అమర్నాథ్ హత్య కేసులో నిందితుడు వెంకటరెడ్డి పాల్గొన్నాడని ఈనాడులో కథనం వస్తే అది తనకు ఆపాదించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. వ్యవస్థలను, పోలీసులను తన గుప్పిట్లో పెట్టుకుని విచక్షణ కోల్పోయి వైసిపి నాయకుడు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. నిందితుడు వెంకటరెడ్డి వినాయక ఉత్సవాల్లో ఎప్పుడు పాల్గొన్నాడనే విషయం నిర్ధారించటం ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో నిర్ధారించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా రాజ్యసభ సభ్యులు మాట్లాడటం హేయమన్నారు. వినాయక నిమజ్జనంలో ప్రభుత్వ వైఫల్యంతో ఇద్దరు యువకులు మరణించారని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు నిమజ్జనం ఏర్పాట్లు సక్రమంగా చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలను అప్రమత్తం చేశామన్నారు. ఇవి ఏమీ లేకుండా ప్రభుత్వ వైఫల్యంతో ఇద్దరు యువకులు మరణిస్తే కమిషన్ తీసుకొని కేసును మూసేసే పరిస్థితి తీసుకువచ్చింది మీరుకాదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో అరాచక ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



రోటరీ సభలో మాట్లాడుతున్న జాగర్లమూడి శివకుమారి

పాఠశాలకు బీరువా బహుకరణ

ప్రజాశక్తి - అద్దంకి

శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఒక బీరువ, ఐదు కుర్చీలు రొటేరియన్ జాగర్లమూడి శివకుమారి సౌజన్యంతో మంగళవారం బహుకరించారు. ప్రభుత్వంతోపాటు దాతలు ఇచ్చిన సౌకర్యాలు కూడా వినియోగించుకుని పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం దాత శివకుమారిని ఎంఈఓ సుధాకరరావుని శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. హెచ్ఎం కె అంజమ్మ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంఈఓ బి సుధాకరరావు, రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, కార్యదర్శి చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించి తిరిగి జగన్ ప్రభుత్వాన్ని అధికారానికి తీసుకురవాలని పర్చూరు వైసిపి ఇంఛార్జ్ ఆమంచి కృష్ణమోహన్ కోరారు. స్థానిక సొసైటీ బిల్డింగ్ నందు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై వైసిపి నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో పార్టీని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, జెసిఎస్ కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.




శిక్షణలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి బి అర్జునరావు

చిన్న సంఘాలతోనే 'సమైక్య' బలోపేతం

ప్రజాశక్తి - బట్టిప్రోలు

గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న సంఘాలే మండల సమైక్యను బలోపేతం చేయగలవని డిఆర్డిఏ పిడిపి బి అర్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమైక్యలో పనిచేసే యానిమేటర్లు, కార్యనిర్వహక సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై 2రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. ఎటిఎం శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. అర్జునరావు మాట్లాడుతూ పొదుపు సంఘాల క్రమశిక్షణతోనే మండల సమైక్య ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని అన్నారు. ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా సభ్యులు చూడాలని కోరారు. జెడ్పిటిసి ఉదయ భాస్కరి మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు కర్ర స్వరాజ్యలక్ష్మి, సీసీలు కొలకలూరి రజని, దాసరి హనోక్, సాంబయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గ్రేడ్-2 జెఎల్ఎంలకు

పే రివిజన్ అమలు చేయాలి

ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇకి యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్స్‌కు పే రివిజన్ అమలు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రీజియన్ అధ్యక్షులు జివి రాగయ్య కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, జెఎల్ఎం గ్రేడ్-2 జెఎల్ఎంలకు న్యాయం చేయాలని కోరుతూ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం "సామూహిక రాయబారం నడిపారు. ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కెవిజి సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జివి రాగయ్య మాట్లాడుతూ 2019 అక్టోబర్ 2న 7500 మంది జూనియర్ లైన్‌మెన్లు ఎపి డిస్కంల నోటిఫికేషన్ ద్వారా నియమించబడ్డారన్నారు. ఈనెల 2 నాటికి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారన్నారు. 2022 పే రివిజన్ గ్రేడ్-2 జెఎల్ఎంలకు వర్తింప చేయాలన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న వీరందరికి ఆగస్టు నెలలో ప్రొబేషనరీ డిక్లర్ చేస్తున్నట్లు అత్యవసరంగా ఎస్ఒలు జారీ చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మంది గ్రేడ్-2 జెఎల్ఎంలు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని, ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయన్నారు. వీరి జీతభత్యాలు ఎపి సచివాలయ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు ఇస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అసిస్టెంట్ లైన్‌మెన్‌గా గ్రేడ్-2 జెఎల్ఎంలకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. డిస్కం జెఎల్ఎంలకు ఇచ్చే సదుపాయాలన్ని జెఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు వర్తింప చేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్-2లకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మూడు కంపెనీలలో జెఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ఒకే విధానం పాటించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సూపరింటెండెంట్ ఇంజినీర్ డిమాండ్లను విద్యుత్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎస్ఇను కలిసిన వారిలో సంఘ రీజియన్ అధ్యక్షులు జివి రాగయ్యతో పాటు వివిధ డివిజన్ల నాయకులు జి.నరేష్, ఏ.చంద్రబాబు, జి.శ్రీనివాసులు, తాండవ కృష్ణ, , తెల్ల వినయ్ కుమార్, మాకాని రవీంద్ర పాల్గొన్నారు.

స్వమిత్ర సర్వేపై ప్రత్యేక దృష్టి

- స్వచ్ఛ సంకల్పంలో చూడచక్కని గ్రామాలుగా మార్చాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వమిత్వ సర్వేపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి సంక్షేమ, అభివృద్ధి అంశాలపై మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిడిఒలు వారి పరిధిలోని గ్రామాలలో పర్యటించి స్వమిత్వ సర్వేలో పురోగతి వచ్చేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 69 గ్రామాలలో ఈ సర్వే జరుగుతుందని, 43 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్, 14 గ్రామాలలో గ్రౌండ్ వ్యాలిడేషన్, 12 గ్రామాలలో ఆర్ఒఆర్ ప్రాసెస్‌లో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలు చూడచక్కని గ్రామాలుగా మార్చడానికి వినూత్నంగా ఆలోచించి పారిశుధ్య కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఈ విషయంపై మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పరిశీలించాలన్నారు. ప్రతి రోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను కచ్చితంగా సేకరించాలన్నారు. గ్రామాలలో వీధుల వెంట చెత్త నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎస్‌డబ్ల్యుపిసి. షెడ్లకు తరలించాలని, ఈ షెడ్డుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ విషయంపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా చేయాలన్నారు. సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని, ఈ విషయంపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్.బి.కె.లు, హెల్త్ క్లినిక్ ల నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. భవనాలను వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను డిసెంబరు 24 లోపు కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంపై ఎంపిడిలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరై కూడా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి వారి స్థానంలో అర్హత ఉన్న వారికి పట్టాలు ఇస్తామని కలెక్టర్. స్పష్టం చేశారు. బేస్మెంట్ వరకు నిర్మించి తరువాత నిర్మాణ పనులను చేపట్టని వారి పట్టాలు కూడా రద్దు చేస్తామన్నారు. ఇలాంటి లబ్ధిదారులను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి నిర్మాణ పనులు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ జివి నారాయణ రెడ్డి, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఈమని పేరయ్య, జడ్పీ సిఇఒ బి. జాలిరెడ్డి, డిఇఒ విఎస్ సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. కొండయ్య, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మా రెడ్డి, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యం అధ్వానం

- కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల ధ్వజం
- భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని తీర్మాణం
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగింది. సమావేశానికి స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లలో కూడా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనిచేసే వారి కంటే పెత్తనం చేసేవారు అధికమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని అధికార పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కూడా ప్రస్తావించారు. అధికార పార్టీ కార్పొరేటర్లు బెంగళూరు నర్సయ్య, అంగిరేకుల గురవయ్య, చంద్రశేఖర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా పారిశుధ్య కార్మికులకు పని విభజన చేయాలని కోరారు. జనసేన పార్టీ కార్పొరేటర్ మలగ రమేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల్లో కొంతమంది మేస్త్రీలు వైసిపి కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నగరంలో ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు తొలగించే కార్యక్రమంలో కార్పొరేషన్ మేస్త్రీలు ఎందుకు పాల్గొంటున్నారని ప్రశ్నించారు. వాళ్లు కార్పొరేషన్ కార్మికులో.? లేక వైసిపి కార్యకర్తలో.? అర్థం కావడం లేదన్నారు.

భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీ తరలించాలని తీర్మానం..

స్థానిక వెంగముక్కపాలెం సమీపంలో ఉన్న భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ విషయంపై ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అంబూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అంత పెద్ద ఫ్యాక్టరీని అక్కడ నుంచి తొలగించడం సాధ్యం కాదన్నారు. అనేక మంది కార్మికుల ఉపాధికి సంబంధించిన విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భగీరథ కెమికల్స్ ప్యాక్టరీ వల్ల సమీప ప్రాంతాల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల భూమి, వాయు, నీటి కాలుష్యం జరుగుతోందని సమీప ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో ఆందోళన చేస్తున్నారని వివరించారు. మూత్రపిండాలు, క్యాన్సర్ వ్యాధులతో అనేక మంది చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని గతంలో తాను ప్యాక్టరీ యాజమాన్యానికి సూచించగా, ఫ్యాక్టరీ యాజమాన్యం తనను రెండేళ్లు వ్యవధి కోరారని తెలిపారు. వారికి ఇచ్చిన వ్యవధి ముగిసిందని తెలిపారు. ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని సూచించారు. ఈ మేరకు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఫ్యాక్టరీని ఇప్పుడున్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తీర్మానం చేశారు. ఇంకా ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్ హెూదాలో ముఖ్యఅతిథిగా హాజరుకావడంతో ఈ సందర్భంగా అధికార పార్టీ కార్పొరేటర్లు ఆయనను ఘనంగా సన్మానించారు.

నల్ల కండువాలతో టిడిపి, జనసేన సభ్యులు..

రాష్ట్ర ప్రతిపక్ష నేత, టిడిపి అధినేత చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, జనసేన పార్టీ కార్పొరేటర్ నల్ల కండువాలతో సమావేశానికి హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు.

ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

నగరంలో ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్న నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల పనిని బట్టి వారి వేతనాలు నిర్ధారించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో అర్హత ఉన్న వారిని కార్యాలయంలో ఉద్యోగులుగా నియమించాలని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కార్మిక సంఘం నాయకులు డి.నాగమల్లేశ్వరరావు, కట్టా రాఘవేంద్ర, సుధారాణి ఉన్నారు.

ఎస్‌పిని కలిసిన టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో జిల్లాలో దేశం పార్టీ శ్రేణులు పలు రకాలుగా ఆందోళనలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో వారిపై పోలీసులు పలు కేసులు నమోదు చేస్తున్న క్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు మంగళవారం జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్‌ను కలిశారు. జిల్లాలోని అద్దంకి, రేపల్లె శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఎస్‌పిని కలిసి పోలీసుల అక్రమ కేసుల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ కార్యకర్తలపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తూ కేసులు పెట్టడం సరికాదని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు.

పామూరు స్పందన కార్యక్రమం రద్దు

6న రాచర్లలో స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పామూరు మండలంలో బుధవారం జరగాల్సిన స్పందన కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు అయినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి బుధ, శుక్రవారం మండలంలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈనెల 6న శుక్రవారం స్పందన కార్యక్రమం రాచర్ల తహశీల్దార్ కార్యాలయం వెనుక బిసి భవనంలో జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికారులందరూ స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని రాచర్ల మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12న జడ్పీ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న ఉదయం 10.30 గంటలకు పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.జాలిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.